జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 28-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 177 పేజీలు: 8 వెల : రూ.7



# డైనమిక్ లీడర్

# రవన్నా..!



సొంత పార్టీ అయిన.. ప్రతిపక్ష పార్టీ అయిన.. ఏ పార్టీ నాయకుడు తప్పు చేసిన ప్రశ్నించే దమ్మున్న ప్రజానేత.. నీచ స్వార్థ దుర్మార్గపు వెన్నుపోటు రాజకీయాలు ఆయనకు తెలియవు.. ప్రజల కోసమే పని చేస్తారు.. ప్రజల కోసమే ప్రశ్నిస్తారు.. అటువంటి నాయకుడే ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవి కుమార్. పార్టీలకతీతంగా పార్టీలతో సంబంధం లేకుండా అసెంబ్లీ సాక్షిగా ఆయన ఆమదాలవలస నియోజకవర్గ సమస్యలే కాకుండా రాష్ట్ర సమస్యలను, అధికారుల అవినీతిని, గత వైసీపీ ప్రభుత్వ అక్రమాలను చట్టసభ దృష్టికి తీసుకువెళ్లిన దమ్మున్న నాయకుడు, ఓన్లీ వన్ డేరింగ్ అండ్ డాషింగ్ అండ్ డైనమిక్ లీడర్ రవన్న.

శ్రీకాకుళం, నవంబర్ 27 (వార్త):

* అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలపై దుమ్మెత్తిపోసిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్
* స్వపక్షంలో విపక్షంలా సమస్యలపై పదునైన విమర్శలు
* జీరో అవర్.. డ్రైవర్ లేని కారులా ఉందని ఎద్దేవా
* నారాయణపురం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులపై ప్రస్తావన
* ఐస్‌లైన్ రిఫ్రిజరేటర్ కొనుగోలుపై నిలదీత
* ఆలోచింపజేసిన బడ్జెట్‌పై ప్రసంగం

## అసెంబ్లీలో గళమెత్తిన రవన్న..

అసెంబ్లీలో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ చేసిన ప్రసంగం ఆద్యంతం అందరినీ ఆలోచింపజేసింది. ఏ అంశంపై మాట్లాడాలనుకున్నా పూర్తి సమాచారం తెప్పించుకుని అవగాహన కల్పించుకుని మరీ మాట్లాడుతారు. ఇదే ఆయన స్పెషాలిటీ. సబ్జెక్టుపై పట్టు లేకుండా ఏదో మాట్లాడేశాం అనే తత్వం ఆయనది కాదు. జీరో అవర్.. డ్రైవర్ లేని కారులా ఉందని కూన రవి అసెంబ్లీలో ప్రస్తావించినపుడు సభ్యులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్పీకర్ అయితే నిండు సభలో అసత్యాలు మాట్లాడకూడదని అంటే.. దీనికి కూన రవి మాట్లాడుతూ జీరో ఆవర్‌లో సభ్యులు లేవ నెత్తిన సమస్యలను ఎవరూ నోట్ చేసుకోవడం లేదని అనడంతో మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి రికార్డు చేసుకుంటున్నామన్నారు. దీనికి స్పీకర్ రికార్డింగ్ కాదు.. రాసుకోవా లని సూచించారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం ఇరిగేషన్ ప్రాజెక్టుకు జైకా నిధులు విడుదల అయినా పునరుద్ధరణ పనులు జరగడం లేదని, దీనివల్ల సుమారు 50వేల ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి కూన రవి తీసుకువచ్చారు. పొందూరు మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గుర య్యాయని, 2014-19లో రెవెన్యూ ల్యాండ్స్ కబ్జాపై విచారణకు ఆదేశించింది. విచారణ ఏం జరిగింది.. ఎటువంటి చర్యలు తీసుకున్నారో తనకు తెలియజేయాలని కోరారు. అలాగే ఐస్‌లైన్ రిఫ్రిజరేటర్ కొనుగోలుకు కేంద్రం నిధులిచ్చింది.. కేంద్రం మార్గదర్శకాలు పాటించలేదని సభ దృష్టికి ఉదాహరణలతో చెప్పుకొచ్చారు. టిడ్కో ఇల్లు లబ్ధిదారుడికి మంజూరైనా ఎందుకు అప్పగించలేదని, లబ్ధిదారులు గతంలో కట్టిన డబ్బులు ఏమయ్యాయని, అలాగే మరిన్ని సమస్యపై సభలో కూన రవికుమార్ ప్రశ్నలవర్షం కురిపించారు.

## ఆయన ఇల్లే.. క్యాంప్ కార్యాలయం..

శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలోని ఆయన ఇల్లే క్యాంపు కార్యాలయం. తన ఇంటి వద్దకు నిత్యం పెద్ద ఎత్తున నియోజకవర్గ ప్రజలు వస్తుంటారు. తమ సమస్యలను గోడును ఆయన దృష్టికి తీసుకువెలుతుంటారు. అన్నింటినీ తానే స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా కృషి చేస్తుంటారు. నియోజకవర్గంలో నిత్యం తిరుగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తుంటారు.. కూన రవికుమార్.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 29న టెలికాం వినియోగదారుల సదస్సు

**శ్రీకాకుళం, నవంబర్ 27(వార్త):** వినియోగదారుల హక్కులు, బిఎస్ఎన్ఎల్ సేవలపై ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కేంద్రంలోని సంచార భవన్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ నాయుడు మర్రి తెలిపారు. ఈ సదస్సులో టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియాలో రిజిస్టర్ అయిన కన్స్యూమర్ అడ్వొకేసీ గ్రూప్ మెంబెర్స్ పరిశీలకులుగా పాల్గొంటారని చెప్పారు. ఈ సదస్సుకు ఆన్లైన్ ద్వారా కూడా గూగుల్ మీట్ లింక్ https://meet.google.com/pac-dsct-svq లింకు ద్వారా వినియోగదారులు హాజరు కావచ్చని, తమ సమస్యలు, సలహాలు తెలియజేయవచ్చని తెలిపారు.

# బాల్య వివాహాలను నిర్మూలించాలి

* కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి
* బాల్య వివాహాల నిర్మూలనకు అందరి సహకార అవసరం
* జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్




**శ్రీకాకుళం, నవంబర్ 27(వార్త):** బాల్య వివాహాలను నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి తెలిపారు. బుధవారం ఢిల్లీ నుండి ఆమె వర్చువల్ విధానంలో నిర్వహించిన "బాల్ వివాహ్ ముక్త్ భారత్" కార్యక్రమానికి శ్రీకాకుళం ఎన్ఐసి నుండి జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాల్య వివాహ ముక్త్ భారత్ లక్ష్యం అన్నారు. పిల్లలు ఎదగడానికి, వృద్ధి చెందడానికి సురక్షితమైన వాతావరణం అవసరమన్నారు. దేశ వ్యాప్తంగా బాల్య వివాహాలను నిర్మూలించడానికి, ప్రయత్నాలను ముమ్మరం చేయడంలో భాగంగా కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి చేతుల మీదుగా "బాల్ వివాహ్ ముక్త్ భారత్" క్యాంపెయిన్ ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాల్యవివాహాలు నిర్మూలనకు అసాధారణ కృషి చేసిన కొందరు వ్యక్తులతో, బాల్యవివాహాలు ఎదుర్కొని విజయం పొందిన ఎంపిక చేసిన 9 మంది పిల్లలతో వర్చువల్గా వారి అనుభవాలను కేంద్ర మంత్రితో మాట్లాడారు. కుంచాల కురమయ్యపేట గ్రామానికి చెందిన బుచ్చ రమణమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తనకు 14 సంవత్సరాల వయస్సులో వివాహం చేశారని, ఈ విషయం శ్రీకాకుళం సమగ్ర బాలల పరిరక్షణ విభాగం అధికారులకు తెలియడంతో తన తల్లిదండ్రులకు పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించి ఈ వివాహాన్ని రద్దు చేయించారన్నారు. ప్రస్తుతం బి.టెక్ పూర్తి చేసుకొని హైదరాబాద్లోని ఐటీ సొల్యూషన్ కంపెనీలో జాబ్ చేస్తున్నానని, మరెంతో మంది బాలికలకు తన అనుభవాలను పంచుకుంటూ, బాల్యవివాహాలు నిర్మూలనకు తనవంతుగా సహాయం చేస్తున్నానని తెలిపారు.

### బాల్య వివాహాల నిర్మూలనకు అందరి సహకార అవసరం

కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు దేశంలో ఒక పెద్ద సమస్య గా మారిందన్నారు. ఈ సమస్యను ఆదిగమించడానికి అందరి సహకారం అవసరమన్నారు. బాల్య వివాహల కారణంగా వారి జీవితాల్లో పెను మార్పులు ఉత్పన్నమవుతాయన్నారు. వర్చువల్ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి శాంతిశ్రీ, పిఓ ఎం.మల్లేశ్వర రావు, పి ఓ ఐ.ఎల్. నాయుడు వివిధ కళాశాలల నుండి విద్యార్థినులు, ఒన్ స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ హిమబిందు, కార్యాలయ సిబ్బంది తదితరులు హాజరైయారు.

## బాల్యవివాహాల నిర్మూలనలో ఎస్హెచ్జీల పాత్ర కీలకం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 27(వార్త):** బాల్యవివాహాలను నిర్మూలించడంలో స్వయం సహాయ సంఘాల పాత్ర కీలకమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో బాల్యవివాహాల నిర్మూలనపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధకం చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18ఏళ్లు, అబ్బాయి వయస్సు 21 ఏళ్లు విధిగా ఉండాలని, నిర్దేశిత వయస్సు లోపు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలను ఎవరు ప్రోత్సహించినా, పెళ్లి చేసినా లక్ష రూపాయలు జరిమానా, మూడేళ్లు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. బాల్య వివాహాలు వల్ల మహిళ ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా మహిళా సంరక్షణ కార్యదర్శికు లేదా పిల్లల సహాయ వాణి టోల్ ఫ్రీ నెంబర్ 1098 తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, పోలీస్ సిబ్బంది సహాయక సంఘాలు పాల్గొన్నారు.







## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**టెక్కలి, నవంబర్ 27 (వార్త):** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి మల్ల తెలిపారు. 'బాల్ వివాహ్ ముక్త్ భారత్ ప్రచారం'లో బుధవారం టెక్కలి మండలంలోని గోపీనాధపురం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 21 సంవత్సరాలు నిండని పురుషులు, 18 సంవత్సరాలు నిండని స్త్రీలు వివాహం చేసుకొంటే దానిని బాల్య వివాహంగా పరిగణిస్తారన్నారు. బాల్య వివాహాలు వల్ల పిల్లల యొక్క విద్య దెబ్బ తింటుందని, శిశు మరణాల రేటు పెరుగుతుందని, తక్కువ బరువున్న పిల్లలు పుట్టడం తదితర సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహం చేసుకున్నవారికి, జరిపించిన వారికి, ప్రోత్సహించినవారికి కఠినమైన శిక్షలు విధించబడతాయని హెచ్చరించారు. సదస్సులో టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వివేకానంద, న్యాయవాది పి.ఆనందరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.ఈశ్వరమ్మ, టెక్కలి ఎస్ఐ కె.రాము, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

* ఎమ్మెల్యే గొండు శంకర్ * నాలుగు బస్సు సర్వీసులు ప్రారంభం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 27(వార్త):** ఆర్టీసీని బలోపేతం చేసి ప్రజలకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం శ్రీకాకుళం బస్ స్టేషన్ ఆవరణలో రెండు కొత్త అధునాతన సూపర్ లగ్జరీ, ఒక అద్దె ఎక్స్ప్రెస్, ఒక అద్దె పల్లె వెలుగు బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 44 కొత్త బస్సులను ప్రారంభించామన్నారు. శ్రీకాకుళం 1వ డిపోకి ఏడు, రెండవ డిపోకి పద్దెనిమిది, టెక్కలి డిపోకి పద్నాలుగు, పలాస డిపోకి ఐదు బస్సులు కేటాయించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాలకు ఈ సర్వీసులు వల్ల ప్రయోజనం కలుగనుందన్నారు. ఆర్టీసీ సర్వీసులను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం 2వ డిపో మేనేజర్ కె.ఆర్.యస్.శర్మ, సూపర్ వైజర్లు వెదుళ్ళ రమేష్, గంగరాజు, చాణక్య, ఉమామహేశ్వర రావు,



ధర్మారావు, శిమ్మయ్య, ఆచారి, రమేష్, ఓ.వి.ఆర్.యస్. సూపర్ వైజర్, భాషా, ఆర్.సి.జి. శ్రీనివాస్, యూనియన్ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది, పీఆర్వో సుమన్ పాల్గొన్నారు.



## భూ హక్కుల కోసం పోరాడుదాం

**మందస, నవంబర్ 27(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతాలైన రాంపురం, మీల గంగువాడ, తెలగ గంగువాడ గ్రామాల్లో తీర ప్రాంత భూపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. ఎయిర్ పోర్ట్ వద్దు ఉద్దానం భూములు ముద్దు అనే నినాదంతో భూమిని కోల్పోతున్న రైతన్నలు నినాదాలు చేశారు. డిసెంబరు ఒకటిన ఎయిర్ పోర్ట్ భూమి పేరుతో నష్టపోతున్న రైతులంతా ఏకమై భారీ బహిరంగ సభకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భూస్వామ్య విధానాన్ని రద్దు చేసి, దున్నేవానికి భూమి పంచినప్పుడు, తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ప్రజలకు ప్రజాస్వామిక హక్కులు గ్యారంటీ చేసినప్పుడు మాత్రమే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఉద్దాన ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ పేరుతో 1394 ఎకరాల భూమిని స్వాధీనం చేసికోవడానికి ప్రయత్నిస్తున్న ప్రభుత్వం, పెద్దలు పునరాలోచించాలని వారు కోరారు. సమావేశాల్లో తీర ప్రాంత భూపరిరక్షణ కమిటీ కన్వీనర్ కొమర వాసు, సర్పంచ్ పొట్టి ధర్మారావు, తామడ తుంబనాథం, దున్న రామారావు, బత్తిని లక్ష్మణ్, చిత్త గున్నయ్య, చిత్త కూర్మారావు, మర్ల సంతోష్, సాలిన ఉమాపతి, గుంటు రమేష్ తదితరులు పాల్గొన్నారు

## డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

**జలుమూరు, నవంబర్ 27(వార్త):** డిగ్రీ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ సిహెచ్ దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. జలుమూరు మండలం తిమడాంకి చెందిన కొయ్యాన భాగ్యలక్ష్మి నరసన్నపేట జ్ఞాన జ్యోతి డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతుంది. రెండు రోజుల కిందట పరీక్ష రాసేందుకు గాను వచ్చిన ఆమె కనిపించడం లేదంటూ తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### 'గేటు పడితే గంట ఆగాల్సిందే'
# కథనానికి స్పందన

**ఇచ్చాపురం, నవంబర్ 27 (వార్త):** ఇచ్చాపురం రత్తకన్న ఎల్ సి గేటు సమస్యపై బుధవారం ప్రచురితమైన 'వార్త'కు రైల్వే అధికారులు స్పందించారు. రైల్ యూజర్స్ కమిటీ అధ్యక్షుడు కట్టా సూర్యప్రకాశ్ ఎక్స్లో రైల్వే అధికారులకి ఈ కథనాన్ని టాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. దీనికి రైల్వే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధించిన అధికారులకి సమాచారం ఇచ్చినట్లు తిరిగి ఎక్స్ వేదికగా సమాధానం ఇచ్చారు.







## వణికిస్తున్న.. ఫెంగల్

* తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన
* 29 నుంచి వర్షాలు
* అధికార యంత్రాంగం అప్రమత్తం

**శ్రీకాకుళం, నవంబర్ 27 (వార్త):** ఫెంగల్ తుఫాన్ రైతులను వణికిస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. శుక్రవారం నాటికి తుఫాన్గా మారనుంది. దీని ప్రభావంతో జిల్లాలో శుక్ర, శనివారాల్లో ఈదురుగాలులతో కూడినవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వరి కోతలు కోయవద్దని, ఇప్పటికే కోసిన పంటను, ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని తీర ప్రాంత గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. కాగా, ఈ ఫెంగల్ తుఫాన్ ఎటువంటి నష్టం కలిగిస్తుందోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలు బాగా పండాయని, చేతికి అందుతాయన్న సమయంలో ఈ తుఫాన్ బెంబేలెత్తిస్తోందని వాపోతున్నారు. కొందరు పంటను కోతలు కోసి పొలాల్లోనే కుప్పలుగా పోస్తున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తిరుపతికి అసిరమ్మతల్లి కోలాటం బృందం



**ఇచ్ఛాపురం, నవంబర్ 27(వార్త):** టి.బరంపురంనకు చెందిన ప్రముఖ జానపద సంగీత కళాకారుడు తిప్పన ధనుంజయరెడ్డి నేతృత్వంలోని అసిరమ్మతల్లి కోలాటం బృందం తిరుపతిలో ప్రదర్శనకు ఎంపికైంది. శుక్రవారం వారు తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్స వాల్లో వారు ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ మేరకు వారు తిరుపతికి బుధవారం పయనమయ్యారు. వీరికి స్థానిక కళాకారులు, కళాభారతి కళాకారుల సంక్షేమ సంఘం, మహతి సాంస్కృతిక కళాశాల సంస్థ కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతుల ఖాతాల్లో 48 గంటల్లో నగదు జమ

**పోలాకి, నవంబర్27(వార్త):** పోలాకిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతుల ఖాతాల్లో నగదు 48 గంటల్లో జమ చేస్తామని తెలిపారు. పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మాజీ ఎంపీపీ తమ్మినేని భూషణరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొండు రామన్న, టీడీపీ మండల అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, కోపరేటివ్ సొసైటీ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకులను పరిశీలించిన విద్యార్థులు





**పలాస, నవంబర్ 27(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఆధ్వ ర్యంలో బుధవారం స్టేట్‌బ్యాంక్, యూ నియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంకు లను సందర్శించారు. అర్థశాస్త్రం అధ్యాపకుడు గణపతిరావు, వాణిజ్యశాస్త్రం అధ్యాపకుడు పి.రమణశ్రీనివాస్ పట్నాయక్ కామర్స్ థియరీ, ప్రాక్టీస్, బ్యాంకింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఎస్‌బీఐ మేనేజర్ వి.సూర్యనారాయణ విదేశీ ద్రవ్య మారకం ఎలా చేయాలో, విదేశీ విద్యను అభ్యసించడంలో ఫారెక్స్ విభాగాన్ని ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు తెలిపారు. యూనియన్ బ్యాంక్,ఇండియన్ బ్యాంకుల్లో బ్యాంకు కార్యకలాపాలను అడిగి తెలుసుకు న్నారు. ఈ పర్యటనలో కామర్స్ అధ్యాపకుడు బి.రాజేష్, ఆంగ్ల అధ్యాపకురాలు ఆర్.దీపకుమారి, కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకురాలు రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకార గుర్తింపు కార్డులను వినియోగించుకోండి

**వజ్రపుకొత్తూరు, నవంబర్ 27 (వార్త):** ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధియోజన(ఎన్ఎఫ్‌డీపీ)పథకాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని పలాస మత్స్య శాఖ ఫీల్డ్ ఆఫీసర్ కొండ నాగరాజు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మత్స్యకారుడికి ఈ పథకం కింద గుర్తింపు కార్డులు జారీ చేస్తామని, వీరికి బీమా కూడా వర్తిస్తుందన్నారు. జిల్లాలోని 104 మత్స్యకార గ్రామాలతో పాటు పలాస నియోజకవర్గంలో వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ, కొత్తపేట, కంబాలరాయుడుపేట, హుకుంపేట, మంచినీళ్లపేట, నువ్వలరేవు, డోకులపాడు, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి, గునుపల్లి, తోటూరు, మందస మండలంలో గెడ్డవూరు, బేతాళపురం, ఎం.గంగువాడ మత్స్యకార గ్రామాల్లో ఉన్న మత్యకారులు ఈ గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన మత్స్యకార మహిళలు కూడా ఈ కార్డులను వినియోగించుకోవాలని సూచించారు.



# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ




**నరసన్నపేట, నవంబర్ 27(వార్త):** నరసన్నపేట ఎంఆర్సీ కార్యాలయంలో బుధవారం జుత్తు జగ్గన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సింహాచలం ఆధ్వర్యంలో పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో యు.శాంతారావు మాట్లాడుతూ నరసన్నపేట, పోలాకి మండలాలకు సంబంధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇది చక్కటి అవకాశం అని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జలుమూరు:** జుత్తు జగ్గన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సింహాచలం బుధవారం జలుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఇప్పిలి వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు వారికి ధన్యవాదాలు తెలిపారు.





## షర్మిలను కలిసిన అంబటి, మామిడి

**నరసన్నపేట, నవంబర్ 27(వార్త):** తనను కాంగ్రెస్ పార్టీ నరసన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి మామిడి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఆమెను బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ పెద్దలు మల్లికార్జునఖర్గే, రాహుల్ గాంధీ, జిల్లా ఇన్‌చార్జి గడం వెంకటత్రినాథ్, డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణకు ధన్యవాదాలు తెలిపారు.

## బోధనా సామర్థ్యాల మదింపు



**నరసన్నపేట, నవంబర్ 27(వార్త):** సాల్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కోమర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సమగ్ర శిక్షా సీఆర్ఎంటీ పి.పెద్దవాడు బోధనా సామర్థ్యాలను మదింపు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనా, అభ్యసనా సామర్థ్యాలు విద్యార్థులకు ఎంతమేరకు దోహదపడుతున్నాయో తెలుసుకోవడానికి ఈ మదింపు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు



**కొత్తూరు, నవంబరు 27 (వార్త):** తమపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన కేసుకు సంబంధించి కోర్టు వాయిదాకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, ఆయన తనయుడు తెదేపా రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్‌తో పాటు 18మంది కార్యకర్తలు బుధవారం హాజరయ్యారు. కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేస్తుండగా, వీరు నిరసన తెలిపారు. దీంతో ఆనాటి ప్రభుత్వం వీరిపై కేసు నమోదు చేసింది. ఈ వాయిదాకు కొత్తూరు జ్యుడీషియల్ కోర్టుకు వచ్చారు.

## రేపు చలో శ్రీకాకుళం

మందస, నవంబర్ 27(వార్త): ఈనెల 29న జరిగే చలో శ్రీకాకుళం కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం వారు కుంటికోట, అల్లిమెరక, సువర్ణాపురం, బహడపల్లి, గంగువాడ, లొహరిబంద, వెంకటవరదరాజపురం, కొత్తపల్లి, సొండిపూడి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు అంబేడ్కర్ విగ్రహాల వద్ద వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వ్యతిరేక వర్గీకరణకు వ్యతిరేకంగా చలో శ్రీకాకుళం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి మోహనరావు, కార్యదర్శి సంక కాళిదాసు, ఉపాధ్యక్షుడు బడియా వల్లభరావు, సంయుక్త కార్యదర్శి ఇప్పిలి చంద్రశేఖర్, పిలక శ్రీనివాసరావు, జె.శాంతారావు, జెన్న శంకర్, దుర్యోధన, సీమల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి: జేసీ

**నరసన్నపేట, నవంబర్ 27(వార్త):** రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆయన కరగాంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేపట్టే దిశగా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.





## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**జలుమూరు, నవంబర్ 27(వార్త):** జలుమూరు గ్రామానికి చెందిన ముద్దు సూరమ్మకు మంజూరైన రూ.2,20,017ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం అందజేశారు. ఆమె ఇటీవల క్యాన్సర్ బారినపడి చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మునుకోటి దాముబాబు, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, మునికోటి గంగాధర్, బగ్గు అప్పారావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యం భేష్



**వంగర, నవంబర్ 27(వార్త):** మగ్గూరు ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో యాగాటి దుర్గారావు ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులు తదితరాలను తనిఖీ చేశారు.మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, శుచిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు బేస్ లైన్ టెస్ట్ నిర్వహించారు. ఆయన వెంట సాల్ట్ కోఆర్డినేటర్ రామారావు, హెచ్ఎం శ్రీకర్, సీఆర్పీ వాసు, ఉపాధ్యాయుడు ఆనందరావు ఉన్నారు.

## డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

**జలుమూరు, నవంబర్ 27(వార్త):** డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. తిమడాంకి చెందిన ఓ విద్యార్థిని నరసన్నపేటలోని ఓ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతోంది. రెండు రోజుల కిందట పరీక్ష రాసేందుకు వెళ్లి, తిరిగి రాలేదని ఆమె తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## దివ్యాంగుల వైద్య శిబిరం




**ఇచ్ఛాపురం, నవంబర్ 27(వార్త):** ఇచ్ఛాపురంలోని వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో బుధవారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అమరిక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మంది దివ్యాంగుల అవయవాల కొలతలు తీసుకున్నారు. పలువురు దివ్యాంగుల నుంచి యూడీఐడీ కార్డులకు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు, పాఠశాల కరస్పాండెంట్ ఢిల్లేశ్వరరావు, కర్రి దుర్యోధన, పరశురాం, పీతాంబరం, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పొలం బడి

**ఇచ్ఛాపురం, నవంబర్ 27(వార్త):** ఆరకభద్ర, కీర్తిపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ధాన్యం సేకరణ ప్రక్రియను వ్యవసాయ అధికారులు వివరించారు. రాబోయే మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని, కోతలు నిలిపివేయాలని సూచించారు. ఇప్పటికే కోసిన పంటని కుప్పలుగా వేసి భద్రపరచాలని కోరారు. ఈ పంట, బీమా గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ కారింగి త్రినాథ, మాజీ సర్పంచ్ పేదిని బాబ్జీ, వ్యవసాయ అధికారి భార్గవి, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.



# అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కృషి

**వజ్రపుకొత్తూరు, నవంబర్ 27 (వార్త):** అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన అమరావతిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానన్నారు. తనకు ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే శిరీషకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చింతలపూడి పాపారావు, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు బర్రి ప్రసాదరావు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ కుత్తుమ్ లక్ష్మణ్, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, దున్న షణ్ముఖరావు, గోవింద పాపారావు, చింత నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



# రైతులూ.. వరి కోతలు చేయొద్దు



**వంగర, నవంబర్ 27 (వార్త):** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.కన్నబాబు సూచించారు.బుధవారం ఆయన పలు గ్రామాల్లోని వరిపంట చేలను పరిశీలించారు. కోతలు నిలిపి వేయాలని రైతులను కోరారు. తొందరపడితే నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన రైతులకు హెచ్చరించారు. బంగాళాఖా తంలో రాబోయే 12 గంటల్లో తీవ్ర వాయుగుండం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు. ఈ నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వరి కోతలు కోసిన వారు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. దళారులను నమ్మి మోసవద్దని, రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు.

**నరసన్నపేట:** వర్ష సూచన దృష్ట్యా రైతులు వరి కోతలు చేయవద్దని నరసన్నపేట మండల వ్యవసాయ శాఖ అధికారిణి సునీత సూచించారు. బుధవారం ఆమె యారుపాడు గ్రామంలో వరి పొలాలను ఆమె పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని సుర క్షిత ప్రదేశంలో భద్రపరచాలని సూచించారు. వరి కుప్పలపై పరదాలు కప్పి ఉంచుకోవాలని కోరారు.

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం మండలంలోని రైతులందరూ వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ వెంకటరావు కోరారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు.ఒకవేళ ఎవరైనా రైతులు వరి పంట కోస్తే, వాటిపై టార్పాలిన్లు కప్పి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆయన వెంట మండల వ్యవసాయ అధికారిణి భార్గవి, ఉప తహసీల్దార్ సంతోష్, వీఆర్వో, వీఆర్ఏలు ఉన్నారు.





# అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



**కొత్తూరు, నవంబర్ 27(వార్త):** అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీవర్కర్స్, హెల్పర్స్ యూనియన్ వారు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కేవీ హేమలత, కె.లక్ష్మి మాట్లాడుతూ కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని హిరమండలం, ఎల్ఎన్ పేట మండ లాలకు చెందిన నలుగురు అంగన్‌వాడీ వర్కర్లు ఇటీవల అనారోగ్యంతో మర ణించినా, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదని వాపోయారు. దీంతో ఆ కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి ఖర్చుల నిమిత్తం కనీసం రూ.20 వేలు ఇవ్వాలని, గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలకు జీవో లు విడుదల చేయాలని, మృతుల కుటుంబసభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని విన్నవించారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుదీష్ణ, సుభాషిణి, నిర్మల, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# కొట్లాట కేసులో నలుగురికి రిమాండ్



నరసన్నపేట, నవంబర్ 27(వార్త): కొల్లవానిపేట గ్రామంలో జరిగిన కొట్లాట కేసులో సివిల్ జడ్జి హరిప్రియ నలుగురికి రిమాండ్ విధించారని ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 9న ఆ గ్రామానికి చెందిన కొల్ల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్ల చిరంజీవితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. వీరిని అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టగా వీరికి రిమాండ్ విధించారన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




**పలాస, నవంబర్ 27(వార్త):** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యు.మాధురి అన్నారు. పలాస జూనియర్ కళాశాలలో బుధవారం బాల్య వివాహాలు, చట్టాలు, శిక్షలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలు నివారణ.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. చట్టాలు, కేసులు, శిక్షలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత నేరాలు జోలికి పోవద్దని హితవు పలికారు.

కార్యక్రమంలో పలాస బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, న్యాయవాదులు పీజే రాజారత్నం, బీకేఆర్ పట్నాయక్, ఎల్.చంద్రశేఖరరావు, బి.రవికుమార్, కె.రజనికుమార్, జి.ప్రభాకర్, టి.శ్యామ్, బి.కాళిదాసు, కళా శాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్, లైబ్రేరియన్ పి.చిరంజీవులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

**జలుమూరు, నవంబర్ 27(వార్త)::** బాల్య వివాహాల నియంత్రణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సీడీపీవో హెచ్.కామాక్షి కోరారు.

బుధవారం జలుమూరులోని ఎంపీడీవో సమావేశ మందిరంలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన వారికి మాత్రమే వివాహాలు జరిపించాలని సూచించారు. ఎంపీడీవో కె.అప్పలనాయుడు మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల వయసున్న బాల, బాలికలను రక్షించాల చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో మాధవరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వంగర ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రజినీదుర్గ అన్నారు. బుధవారం ఆమె మద్దువలస బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను క్షుణ్ణంగా వివరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సాహుకారి మీనాకుమారి, మొగిలి తిరుమలకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**వంగర, నవంబర్ 27(వార్త)::** బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వంగర మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో త్రినాథరావు, ఈవో పీఆర్డీ కెల్ల రామారావు తదితర అధికారులు బుధవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణపై అందరూ దృష్టి సారించాలని సూచించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం బాలికలపై అసమాన ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో ఎం.సత్యవతి, ఈసీ అధికార హరినారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ పొన్నాడ భారతి, ఆయా కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురం సబ్ పోస్టాఫీసులో చోరీకి యత్నం

**ఇచ్ఛాపురం, నవంబర్ 27(వార్త):** ఇచ్ఛాపురం సబ్ పోస్టాఫీసులో చోరీకి మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు యత్నించారు. ఆ కార్యాలయ సిబ్బంది బుధవారం ఉదయం తలుపులు తెరిచేందుకు రాగా, అప్పటికే తాళాలు పగులగొట్టి ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ ఎస్ఐ చిన్నం నాయుడు ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ సంఘటనా స్థలిని పరిశీలించి, ఆధారాలు సేకరించారు. ఎటువంటి నగదు చోరీకి కాలేదని ఎస్పీఎం జ్ఞానవతి తెలిపారు. ఇదిలా ఉంటే రూరల్ పోలీస్‌స్టేషన్‌కి 100 మీటర్ల దూరంలో చోరీకి దొంగలు యత్నించడం విశేషం.



## ఇచ్ఛాపురం కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా చక్రవర్తి

**ఇచ్ఛాపురం, నవంబర్ 27(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా మసూపత్రి చక్రవర్తిరెడ్డిని నియమించారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చక్రవర్తి పోటీ చేసిన సంగతి తెలిసిందే.



## ఒడిశా మద్యంతో ఒకరి అరెస్టు

**మందస, నవంబరు 27(వార్త):** తాళ్లగురంటి పంచాయతీలోని చిన్నకోస్టా గ్రామానికి చెందిన ఒకరిని ఒడిశా మద్యంతో అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐకె.బేబి బుధవారం తెలిపారు. ఈ ప్రాంతంలో దాడులు నిర్వహించగా ఒడిశా లేబుల్స్ ఉన్న ఆరు టిన్ బీరు బాటిళ్లతో నిందితుడ్ని పట్టుకున్నామన్నారు. సారా, అక్రమ మద్యంపై నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. ఎటువంటి సమాచారం ఉన్నా, ప్రజలు ఎక్సైజ్ పోలీసులకు తెలియజేయాలని కోరారు. వీరి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని ఆమె స్పష్టం చేశారు.

## విశాలాంధ్ర పుస్తకాలయం విజ్ఞాన భాండాగారం

**పలాస, నవంబర్ 27(వార్త):** విశాలాంధ్ర పుస్తకాలయం విజ్ఞాన భాండాగారమని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. బుధవారం ఆయన యూనియన్ బ్యాంకు రోడ్డులో ఏర్పాటు చేసిన సంచార విశాలాంధ్ర గ్రంథాలయంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన విశాలాంధ్ర పుస్తకాలయంలో అనేకమంది కవులు రచయితల పుస్తకాలతో పాటు మహాభారతం, రామాయణం వంటి ఇతిహాసాలు, పిల్లల పుస్తకాలు, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర పుస్తకాలు లభ్యమవుతాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు, కౌన్సిలర్ సవర సోమేశ్, సీపీఐ నాయకులు చాపర సుందర్‌లాల్, చాపర వేణుగోపాల్, మేనేజర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎంజీఆర్

**కొత్తూరు, నవంబరు 27(వార్త):** రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం రైతు సేవ కేంద్రాల ద్వారా అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిం దని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమ న్నారు. దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుండా పంటను విక్రయించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలే



సరైన మార్గమన్నారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కనీస మద్దతు ధర చెల్లించి, కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం సాధారణ రకం క్వింటాకు రూ.2300లు, గ్రేడ్ 1 రకానికి రూ.2320లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. రైతుల ఖాతాల్లో డబ్బులు నేరుగా జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అగతమూడి బైరాగి నాయుడు, వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసీవరప్రసాద్, అరుణ్‌బాబు, పెద్దిన అమర్‌నాథ్, వెంకటరమణ, కొాయి లాపు శ్రీను, దశరథ, ఉదయ్ పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం







# ప్రకృతి వనం..

# తోట వారి నర్సరీ

* ఇక్కడ అన్ని రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు
* తక్కువ ధరకు నాణ్యమైన ఇండోర్, అవుట్‌డోర్ మొక్కలు
* పక్షులు, కుక్క పిల్లలు కూడా విక్రయం
* కొనుగోలుదారులతో నిత్యం కళకళ

ఆమదాలవలస, నవంబర్ 27 (వార్త): ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో సెయింటెన్స్ స్కూల్‌కు సమీపాన పార్వతీశంపేటలో 'తోట వారి నర్సరీ' ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చని మొక్కలు, పక్షుల కిలకిలలతో కళకళలాడుతూ ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తుంది. ఈ నర్సరీలో అతి తక్కువ ధరకు నాణ్యమైన అన్ని రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు లభ్యమవుతున్నాయి. సుమారు 50 సెంట్ల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ తోట వారి నర్సరీలో మొక్కలతో పాటు వివిధ రకాల పక్షులు, కుక్క పిల్లలను కూడా విక్రయిస్తుంటారు. ఆమదాలవలస పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు ఇక్కడ లభ్యమయ్యే మామిడి, జామి, కొబ్బరి, ఇతర పండ్ల మొక్కలను కొనుగోలు చేస్తుంటారు. అలాగే ఇక్కడ పూలమొక్కలతో పాటు ఆందాన్నిచ్చే, నీడనిచ్చే మొక్కలు లభ్యమవుతున్నాయి. ప్రకృతి, పచ్చని మొక్కలు, పక్షులపై ఉన్న ప్రేమతోనే ఈ నర్సరీని నడుపుతున్నానని నిర్వాహకుడు తోట రవీంద్ర చెప్పారు. తక్కువ ధరకే నాణ్యమైన మొక్కలను విక్రయిస్తున్నామని, వీటిని ఎలా పెంచాలన్న దానిపై కూడా కొనుగోలుదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.
























Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546